



# రా... జా......

"నేను రాలేను. చూడవలసినవి ఎన్నో ఉండగా ముందు గోల్కొండ దేనికి—సిటీ చూడొచ్చుగా......"

"అబ్బ—అదికాదండీ—సరోజకూడా సరదా పడుతూంది. ఈ రోజు గోల్కొండ పోతే రేపు మిగిలినవి చూడొచ్చు. లేవండీ. మీకెప్పుడూ అందరూ అవునన్నది కాదనడం అలవాటూ సరదామూ." తొందర పెట్టింది శ్రీమతి.

అతను చెప్పాలనుకునేమాట చెప్పనివ్వకుండానే వెళ్ళిపోయింది రాధ. సరోజకూడా వచ్చేసింది.

"నాన్నా, ఈ అను నాన్నా—గోల్కొండ చూడకుండా హైదరాబాదునుంచి వెళ్ళిపోతే ఎంత తలవంపు? ఆ శిథిలాలూ, ఆ దిగజారిన ఔన్నత్యాన్నీ చూస్తూ ఎన్నిరోజులైనా ఉండిపోవచ్చని అనేవాడివిగా అందరితో. తీరా ఇప్పుడు కాదంటావేం నాన్నా." మారాం చేసింది సరోజ.

"పోనీ సాలార్‌జంగ్ మ్యూజియం చూడకూడదామ్మా...."

"నేను ఇదివరకు వచ్చినప్పుడు చూశాను నాన్నా. క్రిందటిసారి గోల్కొండంటే మళ్ళీ వచ్చినప్పు డన్నావ్. తిరిగి రావడం జరిగింది. కానీ నువ్వొప్పుకోవడం లేదు...."

రాజేశ్వరరావు చెప్పలేక పోతున్నాడు.

"ఏం నాన్నా—"ఆగి, తండ్రి వంక చూసింది సరోజ. "గోల్కొండంటే నీకిష్టం లేదా ?"

"అబ్బే. ఇష్టంలేక కాదమ్మా—అదిచూస్తే ఎందుకో—ఏంలేదమ్మా. వెడదాంలే. అమ్మను తయారవమను—"

"అచ్ఛా—నాన్నా" అంటూ పరుగు పెట్టింది సరోజ.

వీళ్ళిద్దరికీ ఎందుకింత పట్టుదల? ఏమిటో ఈ రోజు రాజేశ్వరరావు గుండె ఎందుకో బండగా మారుతూంది. తనేదో కాలక్షేపం కోసం ఈ ఊరు వచ్చాడు. కాని, ఆఖరి క్షణంలో తనిలా తన మనస్సుకు వ్యతిరేకమైన పని ఎందుకు చేస్తున్నాడు? తనలో

**శ్రీ సుభా**

బాధ ఎవరర్థం చేసుకుంటారు ? నాటి స్మృతులతో తన హృదయం మోడువారింది. జడత్వం ఆవరించింది. మనసు మలినమైంది. ఇక్కడికి తిరిగి రావడంతో గతం జ్ఞప్తి రగిలి పొగలుతుందా ? ఉవ్వెత్తు అగ్నిజ్వాలలు లేపుతుందా?

కారు ఆగిన శబ్దమైంది. రాధ సరోజల సందడితో తిరిగి ప్రకృతంలో పడ్డాడు.

* * *

పాతరకం ప్రైవేటు బస్ గతుకుల రోడ్డులో పడి రొప్పుకుంటూ పోతూంది. గోల్కొండ పోతున్నామనే ఉత్సాహం ఎంత ఆపుకోవాలనుకున్నా రాధ సరోజల మొహాల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తోంది. బస్‌తోపాటు అందరి హృదయాలూ ముందుకు పోతూంటే రాజేశ్వరరావు మనస్సు వెనుతిరిగి గతాన్ని తవ్వుకుంటూ గాయాలు రేపుకుంటూంది. బావురుమంటున్న రాతి ప్రాకారాలను, రాలిన శోభను చూస్తే పేలవంగా ఉంది కోట దూరానికి. జీవితంలో సర్వ సౌఖ్యాలనూ, ఆనందాన్నీ అర్రులు జాపుకుంటూ ఏమీ మిగలకుండా అనుభవించిన వ్యక్తి ఏదో విషాద క్షణాల్లో ప్రకృతి వికృతి చర్యలకు పంతాలకు బలిఅయి నాదీ అన్నది ఏమీ మిగలకుండా అంతా పోగొట్టుకున్న మనిషిలావుంది కోట. గతంలోకి చూస్తూ నిస్పృహలతో విడిచిన నిట్టూర్పులు గాలికీ ధూళికీ ఎదిగి శిలలయ్యాయి, బండలయ్యాయి, ఆకారం వికారం చేసుకున్నాయి. పతనమై పతితమైంది గోల్కొండ కోట. దేశాన్ని ఉద్రూతలూగించే కథలెన్నో చెప్పగలిగిన ఆ కోటను శిథిలాలుగా శకలాలుగా చూడగలగడంకంటే హైన్యం, దౌర్భాగ్యం యింకేముంటాయి? ఒక్కొక్కరాయీ దగ్గరవుతూ విచారంగా హృదయాన్ని బీటలు తీస్తున్నది.

రెండు మూడు సింహద్వారాలు దాటి ప్రాంగణంలో అడుగు పెట్టింది బస్. బస్ దిగి 'దిగండీ' అని రాధ హెచ్చరిస్తేనే గాని రాజేశ్వరరావు దిగలేకపోయాడు. సరోజ తనతో తెచ్చిన కాఫీ ఫ్లాస్కును కెమెరానూ సరి చూసుకుంటూంది. రాధ పైకి చూస్తూ నడుస్తూంది. తను వెనక పడ్డాడు.

చేతులుకాలిన తరువాత ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు. జరిగిన దానికి విచారించడమూ వ్యర్థమే. తెలిసికూడా మనిషి చేసేది ఇదే. 'ఒక్క రోజు ముందు వెళ్ళి ఉంటే...?' ఎంతసేపూ అతడు ఆలోచించేది అదే.

ఒక్క ఆశమిగిలింది. తన బిడ్డ ఎక్కడో ఉంది. ఏనాటికి అయినా చూచి "నువ్వు నాబిడ్డవు" అంటే చాలు.

"ఎన్నివందల సంవత్సరాలయి ఉంటుందంటావ్ నాన్నా, ఈ కోట కట్టి?"

తనేదో చెప్పాడు.

"ఎలా అయిపోయిందో. అందుకే ఏదీ శాశ్వతం కాదంటారు...." వైరాగ్యంతో అంది రాధ.

"నాన్నా, ఇదివరకు నువ్వొచ్చినపుడు అన్నీ చూశావుకదూ — మాకు అన్నీ సరిగా చెప్పాలి. లేకపోతే చూడ్డంతప్ప ఏదీ తెలుసుకోలేం." సరోజ కదిపింది.

"అవునండీ...."

"లోపల గైడ్సు ఉంటారు. వాళ్ళు చూపిస్తారు."

"వాళ్ళకు తెలుగు రాదు."

తను నవ్వాడు... "వచ్చునమ్మా."

లోపలకు వెళ్ళారు. ఎత్తయిన మొదటి ప్రాంగణం. ఎవరో గైడ్‌ను మాట్లాడింది సరోజ. గైడ్ కోటగురించి ఏదో చెప్పుకుపోతున్నాడు. నాలుగు ఫర్లాంగుల దూరంలో ఉన్న రాజమందిరంలోకి శబ్దాన్ని సూచించే వింతను చూపించాడు. రెండడుగుల వలయంలో నించుని కొట్టిన చప్పట్లు తిరిగి వింత శబ్దంతో వినిపిస్తున్నాయి. ఆ పరిధి దాటితే ఫలితం శూన్యం.

"ఆశ్చర్యం, చూడు నాన్నా. ఈ నాటి ఇంజనీర్లను నువ్వు తెగపొగిడేస్తావ్. ఎనిమిది వందల సంవత్సరాల క్రితం మన ఆంధ్ర దేశం ఎంత తెలివి మీరిందో..."

"రండి. మిగిలినవి చూదాం" రాధ అంది.

"మీరు వెడుతూండండి. నేను చూసిందేగా"?

"అదేమిటండీ. మీవన్నీ వింతలే. పద సరోజా. మనిషికి ఎంత తోస్తే అంతే..."

గైడ్‌తో కలిసి రాధా సరోజా వెళ్లిపోయారు. తన అడుగులు పడడంలేదు. ఏవో పాత జ్ఞాపకాల్లో మెదడు యిరుక్కుపోతూంది. శరీరంలో హృదయస్పందన శబ్దం — చుట్టూ నిశ్శబ్దం. ఇక నిల్చోలేక పోయాడు.

జంతుశాలలు, స్నానమందిరాలు, రామదాసు బందిఖానా.. అన్నీ వెనక్కు పోతున్నాయి. గతంలో తగిలిన గాయం మట్టుకు వెంబడిస్తూనే ఉంది. ఓ మూలగా వెళ్లాడు.

రెండు బండరాళ్ళు. వాటిమధ్య మనిషి కూర్చునేందుకు స్థలం. అటువైపుగా ఏమీ లేదు. అలా చూస్తూంటే, క్షితిజంలో ఆకాశం భూమి ఒకటవడం, నీలాకాశం మబ్బులతో ఆటలు, ఎవరో పెట్టుకున్న

[redacted]

బొమ్మల కొలువులాంటి ఇళ్ళు దూరంగా ప్రకృతి వయ్యారపు సొంపులు, సుళ్ళుతిరిగి పోకుతున్న దారులు. అతను ఏదో వెతుకుతున్నాడు. చిన్నిరాయిక్రింద ఏదో నల్లని కాగితపు పొట్లం. దానిలో కృశించి, నశించిన గులాబీలు బూడిదఅయి ఉన్నవి. ఆఘ్రాణించబోయాడు. పెళుసయిన కాగితం చప్పుడు మినహాగా మరేమీ లేదు. ఆపొట్లం తిరిగి జేబులో వేసుకున్నాడు. లేచి బాధగా నిస్పృహతో అలా క్షణం నిలబడ్డాడు. కళ్ళు అశ్రుతప్తాలయ్యాయి. హృదయంలో వేదన పొంగి కెరటాలు వేస్తూంది. గుండెలో రక్తం ఉద్వేగంతో ఎగిరి పడుతోంది. మెదడులో నరాలు బిగిసినట్టు వ్యథ. అక్కడ నిలబడలేక పైకి పోయాడు. చాలామంది అటూ ఇటూ తిరుగుతున్నారు. అతను చాలాపైకి వెళ్లాడు. ఎత్తయిన బురుజు. చుట్టూచూస్తే చాలా వింతగా కన్పిస్తోంది. అలాగే నించున్నాడు.

"ఏమండీ, రామదాసు బందిఖానా ఎక్కడండీ?" ఎవరో యువతి చాలా వినయంగా అడిగింది. రాజేశ్వరరావు ఆమె వైపు చూశాడు. పదహారు పదిహేడు సంవత్సరాలుండొచ్చు. చూడగానే అందం ఆకర్షణ పోటీపడి ఆమెలో ఇమిడి యినిమిస్తోంది. అలంకారాలుకూడా చాలా తక్కువ. అవయవాలే అలంకారాలుగా ఉన్నాయి. నారింజరంగు పరికిణీ. వంగపండు రంగువోణీ, మందారరంగు జాకెట్టు. నుదుటి మీద ముంగురులు వంతాలుపట్టి ఎగురుతున్నాయి. ఆమెను చూస్తూంటే మనస్సెందుకో ఒక్కసారి కొరడాతో ఝుళిపించి నట్టయ్యింది. ఎక్కడో చూచిన జ్ఞాపకం. చెప్పలేని అభిమానం పూరుతోంది. ఈ అవినాభావసంబంధానికి తనేమనుకోవాలి ? విప్పి చెప్పుకోలేని యీ అనురాగానికి తనేమని పేరు పెట్టుకుంటాడు ? ఆ మెడ నునుపుతనం, కళ్ళలో స్నిగ్ధత, బరువైన కనురెప్పలు; తన జ్ఞాపకాలు గత వలయంలో గడ్డిపోచలా తిరుగుతున్నాయి... మెదడు ఆలోచనల్లో పరిభ్రమిస్తోంది. నెమ్మదిగా అన్నాడు "అదేనమ్మా" అని.

"అదేమిటండీ అలా చూస్తున్నారు.." కొంచెం భయంగా అడిగింది ఆ అమ్మాయి చుట్టుప్రక్కల చూస్తూ.

నిజం.. ఆ అమ్మాయి తన సరోజ ఈడుదయి ఉంటుంది. అటువంటి యువతిని ఏభయ్యో పడిలో ఉన్న తను అలా చూస్తే ఆ చిన్నివయస్సు ఇంకేమని జవాబు చెప్పుకుంటుంది? తనలో రేగేది అవ్యక్తానురాగమని, గానం చెయ్యలేని రాగమని, మాటలు రాని మూగతనమనీ ఆయువతికేం అర్థమవుతుంది? వెర్రివాడనుకుంటుంది. తమాయించుకున్నాడు.

"ఏం లేదమ్మా.. ఎక్కడో చూసినట్లుంటేను... మీది ఏవూరమ్మా?" ఆగలేక అడిగాడు.

"ప్రస్తుతానికి ఈ వూరేనండి.. ఎక్కడైనా చూశారా..?"

నెమ్మదిగా అన్నాడు : "చూసుండక పోవచ్చునమ్మా.. కానీ ఎక్కడోమాత్రం నీలాంటి స్త్రీని నేను చూశాను.. అంత మాత్రం చెప్పగలను... నీపేరేమిటమ్మా?"

"రాజా...."

ఆయనకళ్ళు ఒక్కసారిగా ఆశ్చర్యజనితాలయ్యాయి.. 'రా...జా' అన్నాడు నెమ్మదిగా వెలుగు చూడలేని వ్యక్తిలా.

"అదేమిటండీ.. నా పేరుగల వ్యక్తి మీకు తెలుసా... నాపేరు అందరూ బాగుందంటారు.. అందుకే రాజీ అని పిలుస్తూంటారంతా.. నిజంగా నాకు కూడా ఎవరైనా రాజా అని పిలిస్తే కలిగేతృప్తి రాజీ అంటే ఉండదు...."

"కారణం ఏమయినా ఉందామ్మా..."

"నాకు తెలిసి ఏమీ లేదండీ.. ఎందుకో ఆపేరు నన్ను కట్టివేస్తుంది. అంతే...."

"ఆపేరు నీకు ఎవరు పెట్టారమ్మా?"

"నాకు అంత అదృష్టం లేదండీ.. నాకు తల్లీ తండ్రీ ఎవరూ లేరు. . అమ్మా నాన్నల చేత పేరెట్టి పిలిపించుకునేటంత అదృష్టవంతురాల్ని కాలేకపోయాను...." ఆమె వదనం మేఘాచ్ఛాదితం అయింది.

"చూడమ్మా. అనవసరంగా నీ మనసు కదిపాను... ఏమిటో నిన్ను చూస్తూంటే ఎన్నో అడగాలనీ, నీ నోటిమీదుగా వచ్చే మాటలు వినాలనీ, నిన్ను ఆప్యాయంగా చూస్తూ అలా ఉండిపోవాలని ఎందుకో అన్పిస్తోంది. . ఆపుకోలేక అడిగాను... అపార్థం చేసుకోకుతల్లీ."

"లేదండీ". . .ఆమె ఉద్వేగాన్ని ఆపుకుంటూ అంది. "చూడండి. . నేను చాలా మందినుండి దూరంగా విసిరివేయబడి పెరిగాను. అమ్మ పోవడంతో అనాథాశ్రమం నాకు యిల్లయింది. అక్కడివాళ్ళే అమ్మా నాన్నా తోబుట్టువులూ అయ్యారు. . వాళ్ల దయతోనే ఇంతవరకూ ఈ శరీరాన్ని పెంచుకొచ్చాను. . కానీ చాలామంది నాతో స్నేహితంగా మాట్లాడ్డానికి, ఆప్యాయంగా మసలడానికీ చిన్నప్పటినుంచీ జడిసేవారు. అప్పట్లో అర్థమయ్యేది కాదు. అందరూ జాలి ఆడుకుంటూంటే నేను వెళ్లగానే ఆపేసేవారు.

ఎందుకో బుర్ర బద్దలు చేసుకున్నా అర్థమయ్యేదికాదు అప్పట్లో.... అందరితోపాటు గొంతెత్తి అరవాలనీ, గెంతాలనీ ఉండేది. కానీ అవన్నీ చిన్నతనమంచీ ఎండమావు లయ్యాయి. ఇంటికొచ్చి దాది నడిగేదాన్ని కారణం ఏమిటని. . . ఆవిడకూడా ఏం చెప్పేది కాదు. ఎందుకో నిశ్శబ్దంగా ఏవో భావాలు దాచుకుంటూ నావైపు చూసేదంతే. నాకు నేను జవాబు చెప్పుకోలేక ఏడుస్తూ ఉండి పోయేదాన్ని. నా జీవితంలో నిశ్చలంగా నిద్ర పోయిన రాత్రులు చాలా తక్కువగా ఉండేవి. విడివడని ఆ చిక్కు ప్రశ్నకు జవాబు ఈ వయసులో దానంతట అదే దొరికింది. ఎవరికైనా జవాబు స్పష్టం అయినపుడు హృదయం శాంతిస్తుంది. కాని ఆ జవాబుతో బండరాయిని కొట్టుకొని శకలాలయ్యే అలయింది నా బ్రతుకు......

"నా తల్లి. ఎవరినో ప్రేమించింది. ఆయన — మా నాన్న — అమ్మను ఎంతగానో ప్రేమించారుట. పెళ్లి చేసుకుని సంసార సుఖా లనుభవించాలనీ, సుదూర సుఖాల్నీ, స్వర్గాల్నీ ఆకట్టుకోవాలని ఊహాల్లుకుంది అమ్మ. కానీ, అవన్నీ వట్టి ఊహాలు కలలుగానే మిగిలి పోయాయి. ఆమె జీవితంలో ప్రేమించినందుకు, మరొక వ్యక్తి నుండి ప్రేమానురాగాల్ని కోరుకున్నందుకు శిక్షగా ఆమెనుంచి నేను ఉద్భవించాను. కానీ, మానాన్న, అమ్మను పెళ్లిచేసుకోలేదుట. అమ్మను ఆ చీకటి దెబ్బ పొట్ట పెట్టుకుంది— హత్య చేసింది. ఆకారణంచేతనే, నేను ఇంతకాలంనుంచీ అందరికీ దూరమయ్యాననీ తెలుసుకున్నాను..."

"మీ. అ. మ్మ. గా. రు—" ఆయన కంఠంలో వణుకు—"ఆత్మహత్య చేసుకున్నారా అమ్మా... .. .."

"జీవితంలో అన్నీ పోగొట్టుకున్న తర్వాత ఆశించిన జీవితం చిమ్మచీకటయినపుడు ప్రతీ ఆడదీ చేసేపనే అమ్మా చేసింది. ." ఆమె తనమాటలు విన్పించుకునే స్థితిలో లేదు. వణుకుతున్న కంఠాన్ని స్వాధీనం చేసుకొనడానికి వ్యర్థంగా ప్రయత్నిస్తూ చెబుతూంది. ఆమె కళ్లు అశ్రువుల్ని నింపుకుంటున్నాయి. గుండె ఎగసి పడుతూంది. ప్రళయం పుట్టేముందు ప్రకృతిలాగుంది.

"మొన్ననే దాది ఈవిషయం నాకు ఉత్తరం ద్వారా చెప్పగలిగింది. ఆమె వ్రాసినది—

'చూడమ్మా, రాజా, నువ్వు అందరికీ దూరమయ్యాననీ, దూరమవుతున్నాననీ బెంబేలు పడవలసిన అవసరం లేదు. మీ అమ్మను నేను చాలా సన్నిహితంగా ఎరుగుదును. ఆవిడ నిష్కల్మషంగా ప్రేమించిన వ్యక్తిని ఆరాధించింది. మీ నాన్నే మా అమ్మను మోసంచేస్తే తప్పు మీ అమ్మదంటావా తల్లీ ? నీ కోసం తను జీవించింది. నిన్నీ లోకంలో విడిచి వెళ్లింది. నువ్వు జీవించి మీ అమ్మలాంటి వ్యక్తుల్ని చూసి జాలి పడడానికి, అలాంటి వాళ్లను ఆదుకోడానికి నీకు జీవితాన్నిచ్చింది. అంతేకాని రోజా నీ బ్రతుకుగురించి బాధ పడమని కాదు. నీకు పేరుకు చూడడానికి తల్లితండ్రులు లేక పోయినా నువ్వు తల్లి తండ్రులు కన్నబిడ్డవే.. ప్రపంచంలో అందరికీ ఉండే స్వేచ్ఛ నీకు లేకుండా అరికట్టడానికి ఎవరికీ అధికారం లేదు. ఉన్నా నువ్వు భీతిగా ఒకరికి ఒదిగి పడాల్సినంత తప్పేం చెయ్యలేదు. నువ్వు సుఖపడతావు. నీతోపాటు నలుగుర్ని సుఖపెట్ట గల్గుతావు...' ఇలా రాసింది ఆమె. కాని నాకేమిటో అర్థం కాదు......"

ఆయన లేనిగాంభీర్యం ఎరవు తెచ్చుకుంటూ అన్నాడు—"మనం మనుష్యులం తల్లీ. లేని లోట్లను భర్తీ చేసుకుందుకూ, కావల్సిందాన్ని ఆకట్టుకుందుకూ అనేకమైన అవకాశాలు ఉన్నాయి. . చూడు, తల్లీ. ఏచెట్టు తొర్రలోనో ఒంటిగా పెరుగుతుంది పక్షిపిల్ల. రోజా నిరాత్రికో. గూటికి చేరుకునే తల్లి తండ్రుల గురించి తపనే. ఏదో ఒకవాడు వేటగాని వేడిబాణానికి ఆహుతయిపోతాయి. ఆ పసిగందు ఎలా పెరుగుతుందంటావు. దాని హృదయంలో కలత దైన్యం ఏమని చెప్పుకో గలదు ? తన బాధ వ్యక్తం చెయ్యలేని ఆ చిన్నిపక్షీ, మాడిపోయిన చెట్టు, కూలిపోయిన ఈ బండ రాళ్లు—వీటిని ఏమంటావు తల్లీ? బాధ పడడం, బాధనుండి తెప్పరిల్లడం ఒక్క మనుష్యులకే చేతనవును తల్లీ....." ఆయన కంఠం రుద్ధమయింది ఆమె అలా స్థాణువులా వింటోంది. .

"నిజమేనండి. కాని ఎంత ధైర్యం చెప్పుకోవాలనుకున్నా ఏదో వెలితి గుండెల్ని పట్టుకుంటుంది. ఇంత నిండుగా జీవించడం ఎవరికోసం అని ప్రశ్నించుకుంటే జవాబు శూన్యం. మనతో మనసిచ్చి మాట్లాడే వ్యక్తి లేనప్పుడు, సానుభూతి అంటూ లేనప్పుడు జీవితం సార్థకమవుతుందంటారా?"

ఆయన అమితమైన వ్యథతో నవ్వాడు.

"...ఈ చిన్ని బాధకే నీ హృదయం ఇంతగా బాధపడుతూందా తల్లీ ? కొండంత పట్టని వ్యథను యీ గుండెల్లో దాచుకుని చావురాక తికమక పడుతున్నాను తల్లీ—నన్నేమంటావు? పెళ్లి చేసుకున్నాను, పిల్లల్ని కన్నాను, జీవితంలో ఆఖరి అంకం నడుస్తోంది. కానీ యీ గాయంతోనే అన్నిటినీ ఎదుర్కొంటున్నాను. చుట్టూ శూన్యం. నాకోసం నా ప్రయోజనం కోసం ఏమైనా చేసుకుని ఇరవై సంవత్సరాలవుతూంది తల్లీ. ఈ గడ్డు దినాలు ఇంకొకరికోసం, వాళ్ల సంతృప్తి, చిరునవ్వుల కోసం మాత్రమే గడుపుతున్నాను. నా జీవితం నాచేత విషం త్రాగిస్తూ అందరికీ ఈ చేతులతోనే అమృతం అందింపజేసింది. ఆశ్చర్య పడ్డావంతే... జీవితంలో ఇంతగా ఓడిపోయినందుకు నిస్పృహ చిమ్మచీకటిలా ఆదరించేది. . . చీకటి, విషాదం, జడత్వం నాకు స్నేహితు లయినాయి. . వాటి నీడల్లో ఉయ్యాలలో బిడ్డలా తమ్మకోవడం యింతవరకూ జరిగింది. హృదయపూర్వకంగా నవ్వడం, మనసారా మాట్లాడ్డం — ఇప్పుడు నేను చెయ్యలేని పనులేమో అన్పిస్తుంది. ."

ఆయ నింక మాట్లాడలేకపోయాడు. రోజా ఆశ్చర్యంగా ఆయన్ను చూస్తూ వుండిపోయింది. ఆ నుదుటి ముడతల్లో ఆ కళ్ల వెనుకా దాగిన అర్థంకాని చరిత్ర ఏదో ఆమెను కలవరపరిచింది. ధైర్యా ఆమెను ఆవహించింది. దీనంగానే అడిగిం ది—"మీరు జీవితంలో యిలా మారిపోవడానికి కారణం ? మీకు నా అన్నవాళ్లు ఎవరూ లేరాండీ?"

ఆయన నవ్వాడు. చాలా నెమ్మదిగా విషాదంతో నిండిన చిరునవ్వు. . .

దూరంనుంచి విసురుతున్నట్టుగా విన్పించాయి సరోజ మాటలు—"నాన్నా... అమ్మా నేనూ, రాజదర్బారు చూసివస్తాం. నువ్వూరా." జవాబు కోసం చూడకుండా ఆ ఆకారాలు నడచిపోతున్నాయి గతుకుల్లో పడి.

"మీ అమ్మాయాండి?"

"అవునమ్మా. నీ యీడుదే."

"ఆవిడ........?"

"ఆ అమ్మాయి తల్లి."



ఉపాధ్యాయుడు—"అంతట ఆ మహారాణి అవ్వనంబునందు ఒక సింహమును కని. . . . ."

విద్యార్థి—మాస్టారూ, మహారాణులకు సింహాలు, పులులు కలిగేవాండీ ?

—మందలపర్తి భుజంగరావు (భీమవరం)

రాజా ఆశ్చర్యంగా చూసింది...కళ్ళు తన భార్య అని చెప్పడేమా అని....ఆశ్చర్యం ఒలక పోస్తూ విప్పారినవి.

"అవునమ్మా..... నువ్వాశ్చర్య పోతున్నావు కదూ — భార్య, పిల్లలు, ఇంకా తెలియని ఎందరో వుండి ఆనందం లేదంటా నేమిటా అని?"

"అవునండీ, జీవితంలో యింతకు తప్ప మరేం కావాలి, ఎవరికైనా?"

"అవునమ్మా.... చాలామందికి అంతే కావాలి.. కానీ నా జీవితం దేనినైతే కోరుకుందో ఆ గమ్యాన్ని చేరలేదు. గమ్యాన్ని చేరకుండానే మరో దారిని నన్ను బలవంతంగా నడిపించారు అందరూ. ఈ దారంతా నాకు కొత్త. దీని గమ్యాలూ, అనుభవాలూ నేనెప్పుడూ వూహించనివి, రుచి చూడనివి. నా కల లిప్పుడు రెక్కలు కోసిన పక్షులయ్యాయి...నా రెక్కలూడిపోయినందుకు నాకు బాధ లేదు తల్లీ. కానీ తన జీవితం నాకు అంకితం చేసుకుని నన్నే ఆధారం చేసుకుని వూహ అల్లుకున్న వ్యక్తి నా ఓటమితో పూర్తిగా పతనమయింది. నేను అందర్నీ కాదని ఎగర గలిగినవాడు......"

ఆమె నెమ్మదిగా అడిగింది: "మీ రెవర్నయినా ప్రేమించి పొందలేకపోయారాండీ"

"ప్రేమించడం...." నవ్వాడు నల్లగా ఆయన.

".....అందరి ఎదురుగా చేసుకున్నదే వివాహం అంటే నేనేం జవాబు చెప్పలేను. మా వివాహం మేమే చేసుకున్నాం. ఈ బండరాళ్ళు బంధువులై మమ్మల్ని ఆనందంగా ఆహ్వానించాయి. ఈ శిథిలాలు మాకు అంతఃపురాలై ఆదరించాయి. నా జానకిని నేను ఇక్కడే ప్రేమించాను. పెళ్ళి చేసుకున్నాను. ఇక్కడే నా జానకి నాకు దూరమయింది కూడా. ఈ

## 'రా....జా'

శిథిలాల్లో ఒకటిగా మాత్రం నేను కాలేక పోయాను. నా జానకి దృష్టిలో నేను మోసగాణ్ణయ్యాను...జానకి దగ్గరకు వెళ్ళి 'నేను క్షమార్హుణ్ణి' అని చెప్పుకోవాలని ఈ ఇరవై సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాను....ఆ అవకాశం నాకు రాలేదు....నేను రోజూ చని పోతూ, బ్రతుకుతూ ఇలా బండబారి పోయాను....."

"చూడండి బాబయ్యగారూ, గతంలోకి వెడితే కొందరి జీవితాలు చాలా చిరిగి వుంటాయి. వాటిని మరిచిపోవడానికి ప్రయత్నించాలి. మీ అంతట మీరు మీ భార్యకు ఏ అన్యాయం చెయ్యలేదని......"

"......తెలుసు. నా ఆత్మకు తెలుసు. కానీ.. నే నొక్క రోజు ముందు వెళ్ళుంటే జానకి నాకు దక్కేది....నెలలు నిండాయి...నాకోసం రోజూ ఎదురు చూస్తూ ఎదిగే పాపకు ఆశ నింపుతూ జీవించింది......మా నాన్న....తనను కాదన్నానని నాతో భేటీ వేశాడు.. ఆఖరి క్షణాలు....నావాళ్ళు అందరితో అనుబంధం త్రెంచుకొన్నాను. కానీ నావాళ్ళు పరోక్షంగా నన్ను కాదంటూనే జానకికి వుత్తరం వ్రాశారుట, నాకు వివాహం నిశ్చయమైనట్లు. నా జానకి హృదయం శకలాలయింది...నా బిడ్డను యీ ప్రపంచంలో వదిలి తనీ ప్రపంచంనుంచి నిష్క్రమించింది...నన్ను అవిటివాడిగా 'జీవించమని శపించింది....నా బిడ్డకోసం తిరిగాను — ఈనాటివరకూ తిరుగుతున్నాను.....ఎక్కడ వుందో తెలియదు....ఆ తపనతోనే ఈ శరీరం తూట్లుపడి వార్ధక్యాన్ని కప్పుకుంటోంది...నా బిడ్డను చూసి ఒక్కసారి 'నువ్వు నా బిడ్డవి' అనగలిగితే చాలు.....జానకి నన్ను క్షమిస్తుంది.. నన్ను ఆదరంతో ఆహ్వానిస్తుంది. ఆ ధైర్యం నాకుంది....నిన్ను చూడగానే నీ పేరు వినగానే నాలో నిద్రించిన అనురాగం కొత్త రాగం పాడింది. నీ పేరు...జానకి అంటూండేది... 'మన బిడ్డకు రాజా అని పేరు పెడదాం' అని. అందులో మా పేర్లు ఎల్లకాలం ప్రతిధ్వనించాలని ఉబలాట పడేది. ఈ రాజేశ్వరావూ, జానకీ 'రాజా'గా ఆడుకుంటూంటే చూడాలనుకునేవాళ్ళం...నిన్ను చూడగానే నా బిడ్డవనే ఆశ జనిస్తోంది."

రాజా మొహంమీద ప్రాకారం నీడలు పడ్డాయి... ఆమె ఒక్కసారి పక్కకు తిరిగి పెల్లుబికి వస్తున్న కన్నీటిని చేత్తో చిదుముకుంది.

".....చూడండి. నాకు జీవితంలో ఏమీ లేదు. ఇంతవరకూ నేను ఎవర్నీ 'నాన్నా' అని పిల్చే అవకాశం లేకుండాపోయింది."

ఆయన ఉత్కంఠంతో అడిగాడు—

"నిన్ను నా బిడ్డగా పిలవమంటావా తల్లీ? ఆ అవకాశాన్ని యీ ముసలివాడికి ఇస్తావా అమ్మా...." అని.

ఆమె ఎగసిపడే హృదయంలో ఆరాటాన్ని అణచుకొంటూ, ఆనందమో విషాదమో తేల్చుకోలేని తన్మయత్వంతో వాగిసలాడుతూ అంది: "నాకూ నాన్న ఉన్నాడన్న తృప్తి అయినా వుంటుంది. 'నాన్నా' అని పిలవనివ్వండి. ఈ శిథిల హృదయంలో అనురాగానికీ అభిమానానికీ యీ రోజే అంకురార్పణ అవుతుంది." రాజా ఆగింది...వెయ్యి వెలుగులు ఉద్భవించే కళ్ళతో ఆయనలోకి చూస్తూ అంది—"నాన్నా" అని.

కన్నబిడ్డగా....నిండైన హృదయంతో 'రాజా' అన్నాడు ఎన్నో ఏళ్ళ తరువాత వెలిగిన సంతృప్తిలో మునిగి తేలుతూ రాజేశ్వరరావు.

"మీరు నన్నేనాడయినా చూడాలనుకున్న నాడు ఎక్కడున్నాసరే మీకోసం కన్నకూతురుగా ఎదురు చూసి ఆహ్వానించే ప్రాణి ఉందని మరిచిపోకండి....నేవెడతానండి....నా తోడివారు నాకోసం ఎదురు చూస్తూవుంటారు."

ఆయన నెమ్మదిగా అన్నాడు—

"అలాగే నమ్మా...కానీ నిన్ను చూడ్డానికి రావాలనుకున్నా యీ వయస్సు రానివ్వదు తల్లీ. నా అడ్రసు యిస్తా....నువ్వే వచ్చి పోతూండమ్మా. ఈ ముసలికాయం నిన్నెప్పుడూ ఆహ్వానిస్తూనే వుంటుంది."

".....వస్తా.....నాన్నా" అంటూ కన్నీటిని పవిటితో అదుముకుంటూ భారంగా క్రిందికి దిగుతూ వెడుతూంది రాజా...

రాజేశ్వరరావు కూడా ఆవేశపు పొంగును, చెలియలి కట్ట తెగి ప్రవహించే ఆనంద విషాదాల మిశ్రమపు వలయంలో రేగిన కన్నీటిని వణికే చేతులతో వత్తుకుంటూ "నాకు తెలుసు. నువ్వు నా బిడ్డవమ్మా....నా కన్నబిడ్డవే" అనుకుంటూ అలా చూస్తూ వుండిపోయాడు. జేబులోని వాడిన గులాబీ పుష్పాన్ని కళ్ళకద్దుకున్నాడు. ★

కష్టమే ఫలిస్తుంది ! సత్యమే జయిస్తుంది !!

# రవి ట్యుటోరియల్ కాలేజి

| బాలికాశాఖ | బాలురశాఖ |
| --- | --- |
| 2 వ లైను | 3 వ లైను |

బ్రాడీపేట — గుంటూరు - 2.

లో చేరి విజయం పొందండి, ఎందరో ఫస్ట్ సెకండ్ క్లాసులలో ప్యాసయినారు. 4,5 ఫారములుతప్పినవారుకూడ మెట్రిక్‌చదవవచ్చు. భోజనవసతులుగల 3 హాస్టల్సు, 32 మంది అధ్యాపకులు, మంచి లేబరేటరీగలిగి మీ ఆదరాభిమానములు చూరగొన్న విద్యా సంస్థ. మా విద్యార్థులే మీకు సాక్ష్యం. మీ సేవే మా లక్ష్యం.

వివరాలకు: సి. వి. ఎస్. ధన్ ఎం.ఎ., ప్రిన్సిపాల్.